రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## పీర్జాదిగూడ మేయర్‌పై అవిశ్వాసం వాయిదా

**బోడుప్పల్, జూన్ 5 (ప్రభాతవార్త):** పీర్జాదిగూడ నగర పాలక సంస్థ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిపై మెజారిటీ కార్పోరేటర్లు ప్రతిపాదించిన అవిశ్వాస ప్రత్యేక సమావేశాన్ని వాయిదా వేస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 6వ తేదీన పీర్జాదిగూడ నగర పాలక సంస్థ మెజారిటీ కార్పోరేటర్లు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ నజిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. కార్పోరేటర్ల నోటీసును పరిశీలించిన కలెక్టర్ జూన్ 5వ తేదీన అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తూ గత నెల 18వ తేదీన కార్పోరేటర్లందరికి సమాచారం అంజేశారు. ఇందులో ముగ్గురు కార్పోరేటర్లు తమ సంతకాలను వేరే అవసరాల కోసం తీసుకొని దుర్వినియోగంన చేశారని జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. అదే విధంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అవిశ్వాస ప్రత్యేక సమావేశాన్ని వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తిరిగి ఎప్పుదు నిర్వహిస్తారనే విషయం పేర్కొనలేదు.

## స్ట్రాంగ్ రూమ్‌లకు వివిప్యాట్,ఈవిఎంల తరలింపు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికల అనంతరం జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన వివిప్యాట్‌లను స్థానిక తహసీల్దారు కార్యాలయం స్ట్రాంగ్ రూమ్‌లో బద్రపరచడం జరిగిందని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డితో కలిసి ఇవిఎంలను బద్రపరచిన ఏఏంసి గోడౌన్, తహసీల్దార్ కార్యాలయ స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పార్లమెం ట్ ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయిన సందర్భంగా వికారాబాద్, కొడంగల్, పరిగి , తాండూరు నియోజ కవర్గాలకు సంబంధించి వికారాబాద్, కొడంగల్, పరిగి తాండూరు నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు ఉపయోగించిన ఈవిఎంలు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లను ఏఏంసి గోడౌన్‌లో బద్రపరచడం జరిగిందన్నారు. సంబంధిత రిజిస్టర్‌లలో సంతకాలు చేశారు. నిరంతర సిసి కెమెరాల పర్యవేక్షణ ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిసిఇఓ సుధీర్, ఆర్‌డిఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మినారాయణ ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.



# కంచుకోటలో కాంగ్రెస్ జెండా

- -నాగర్‌కర్నూల్‌లో మెరిసిన హస్తం పార్టీ
- -మూడుసార్లు గెలిచిన మల్లురవి
- -16 పర్యాయయాల్లో 9సార్లు జయకేతనం

**ఆమనగల్లు, జూన్05, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి విజయకేతనం ఎగురవేసింది. ఆపార్టీ అభ్యర్థి మల్లు రవి విజయం సాధించారు. దీంతో మూడోసారి ఆయన పార్లమెంట్‌లో అడుగుపెట్టనున్నారు. నాగరకర్నూల్ పార్లమెంట్ స్థానం (ఎస్సీ) కాంగ్రెస్‌కు కంచుకోటగా ఖ్యాతిగాంచింది. 1962 నుండి 2024వరకు 16సార్లు ఎన్నికలు జరగగా అందులో 9సార్లు కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. అందులో మల్లు రవి 1991, 1998, 2024 ఎన్నికల్లో విజయం ఢంకా మ్రోగించారు. ఈస్థానం నుండి మూడుసార్లు గెలుపొందిన మల్లు రవి ముచ్చటగా మూడోసారి పార్లమెంట్ మెట్లు ఎక్కనున్నారు. కాగా 1962 ఎన్నికల్లో (జె. రామేశ్వర్‌రావు), 1967లో (జే.బి. ముత్యాలు), 1977లో (ఎమ్. భీష్మాదేవ్) 1980లో ( మల్లు అనంతరాములు) 1989లో (మల్లు అనంత రాములు), 1991లో (మల్లు రవి), 1998లో( మల్లు రవి), 2014లో (నందిఎల్లయ్య), 2024 లో (మల్లు రవి)లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసి కాంగ్రెస్ కంచుకోటగా మార్చుకుంది. 1971 ఎన్నికల్లో ఎం.భీష్మాదేవ్ తెలంగాణ ప్రజా సమితి తరుపున గెలుపొందగా, తెలుగుదేశంపార్టీ తరపున 1984 వి.తులసీరాం, 1996, 1999, 2004లో మందజగన్నాథంలు విజయం సాధించారు. 2019లో పోతుగంటి రాములు బీఆర్ఎస్ పార్టీ తరపున గెలుపొందారు. కాగా 2019 ఎన్నికల్లో పోతుగంటి రాములు చేతిలో 1,89,748 ఓట్లతో పరాభవం పాలైన మల్లురవి, ప్రస్తుత ఎన్నికల్లో రాములు కొడుకు బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌పై 94414 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.



విజయం సాధించిన తరువాత ముఖ్యమంత్రిని కలిసిన మల్లు రవి

## పిడుగుపడి వ్యక్తి మృతి....

**షాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** పిడుగుపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని సంకేపల్లిగూడ గ్రామ సమీపంలో గల భారత్ గ్యాస్ గోదాం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.... చేవెళ్ల మండలం గుండాల గ్రామానికి చెందిన బేగరి వెంకటయ్య(45), తలారి నర్సింలు ఇద్దరు కలిసి బుధవారం ఉదయం షాద్‌నగర్‌కు పనినిమిత్తం వెళ్లారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో వర్షం వస్తుందని సంకేపల్లిగూడ గ్రామ సమీపంలో గల భారత్ గ్యాస్ గోదాం సమీపంలో చెట్టు కింద నిలబడ్డారు. ఒక్కసారిగా పిడుగు పడడంతో బేగరి వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తలారి నర్సింలు వెంకటయ్యకు సీపీఆర్ చేశాడు. అయినా ప్రయోజనం లేదు. దీంతో గ్రామస్థులకు ఫోన్ చేసి చెప్పాడు. గ్రామస్థులు, పోలీసులు వచ్చి ఇద్దరిని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## విద్యార్థుల కోసం యూనిఫామ్స్ తయారు



.జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల కుట్టు శిక్షణ కేంద్రాల్లో విద్యార్థుల యూనిఫామ్స్ సిద్ధం చేస్తున్న దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 5, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం యూనిఫామ్స్‌ను మహిళా స్వయం సహాయక సంఘాల వారి ఆధ్వర్యంలో కుట్టు శిక్షణకేంద్రాల్లో సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున త్వరగా దుస్తులను అందించటానికి జోరుగా కుట్టు కేంద్రాల్లో తయారు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించే దిశగ స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా దుస్తులు సిద్ధం చేస్తున్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు డిఆర్‌డిఏ, మెప్మా, జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో గల ఆధీనంలో గల 507 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 89,565మంది విద్యార్థులకు జిల్లాలో గల స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్ అందించటానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. పాఠశాలలు ప్రారంభించే 12వ తేదీలోపు కనీసం ఒక జత యూనిఫామ్ అందించాలని సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టారు. జిల్లాలో గల ఐదు గ్రామీణ మండలాలు, 8మున్సిపాల్టీలు, జిహెచ్‌ఎంసి పరిధిలో గల 507 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేయటానికి శ్రీకారం చుట్టినట్లు డిఆర్‌డిఓ సాంబశివరావు పేర్కొన్నారు. గ్రామీణ మండలంలో గల 125పాఠశాలల్లో 11,278 మంది విద్యార్థులకు, మున్సిపాల్టీల్లోని 117పాఠశాలల 9,921మంది విద్యార్థులకు, జిహెచ్‌ఎంసి పరిధిలో 265పాఠశాలల 28,330మందికి యూనిఫామ్స్ కుట్టించటం జరుగుతుందన్నారు. సంఘ సభ్యులను ప్రోత్సహించటానికి ప్రభుత్వం 50రూపాయలు నిర్ణయించినట్లు, దీనికి 25రూపాయలు జోడించి 75రూపాయలు చెల్లించటానికి నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు. జిల్లాలో ఐదుగురు డిపిఎంలు, ఎపిఎంలు పర్యవేక్షిస్తున్నారు. మహిళలను ఇక పారిశ్రామిక వేత్తలుగ మార్చటానికి ప్రభుత్వం యూనిఫామ్స్ తయారు కోసం మహిళా స్వయం సహాయక సంఘాలకు అవకాశం కల్పించిందన్నారు. బ్యాంకులు శ్రీనిధి ద్వారా రుణాలు అందించి పర్మినెంట్ కేంద్రాలు నిర్వహించే దిశగ తగు చర్యలు తీసుకుంటున్నట్లు డిఆర్‌డిఓ సాంబశివరావు తెలిపారు. డిఇఓ విజయకుమారి డిఆర్‌డిఎ ద్వారా మహిళలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. జిల్లాలో విద్యార్థుల యూనిఫామ్స్ తయారుకు కుట్టు కేంద్రాల్లో మహిళలు ఉత్సాహంగ పాల్గొంటున్నారు.

## విద్యుత్‌షాక్‌తో పాడి ఆవు మృతి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 5, ప్రభాత వార్త:** విద్యుత్ షాక్‌తగిలి పాడిఆవు మృత్యువాత పడిన సంఘటన పోచారం మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో బుధవారం చోటుచేసుకుంది. ఇస్మాయిల్ ఖాన్‌గూడ గ్రామానికి చెందిన బీర్ల బాలమల్లేశ్ తన పాడి ఆవును మేత కొరకు తన పొలంలో వదలిపెట్టగా అప్పటికే విద్యుత్ తీగలు స్థంభం నుండి తెగిపడినే లపై పడి ఉండటంతో పొలంలోకి వెళ్లిన ఆవుకాళ్లకు విద్యుత్‌వైరు తగలడంతో విద్యుత్‌షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందినట్లు బాలమల్లేశ్ తెలిపారు. మృతి చెందిన పాడిఆవు విలువ దాదాపు 90 వేల రూపాయలుంటుందని పాడిరైతు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాడిఆవు మృ త్యువాత పడిందని అన్నారు. విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాడిఆవు మృతితో నష్టపోయిన పాడిరైతుకు పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.



స్మాయిల్ ఖాన్‌గూడలో విద్యుత్‌తీగలు తగిలిషాక్‌కొట్టి మృత్యువాత పడిన ఆవు దృశ్యం.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న ఎంపిపి సుకన్య భాష, ఎంపిడివో నరేందర్ రెడ్డి,ఉపాధి హామీ కూలీలు



మొక్కలు నాటిన నేలతల్లి అధ్యక్షులు చంటి



మొక్కలు నాటుతున్న మాజీ చైర్‌పర్సన్, అధికారులు

**యాచారం జూన్5,ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ఎంపిడివో నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో యాచారం మండల పరిధిలోని మల్కిన్ గూడ, నందివనపర్తి, యాచారం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ ఆధ్వర్యంలో మొక్కలు నాటి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపిపి సుకన్య పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రకృతిని దైవంలా కోలిసే మన సాంప్రదాయంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దేరంగుల శారద శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**కడ్తాల్ మండలంలో..**

**కడ్తాల్, జూన్ 05 ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేలతల్లి అధ్యక్షులు చంటి ఆధ్వర్యంలో స్థానిక కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ పర్యావరణ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు. పర్యావరణం బాగుంటేనే ప్రజలందరు క్షేమంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరి, మౌనిక, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

**తాండూరు మండలంలో..**

**తాండూరు, జూన్ 5, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రీక విజయలక్ష్మి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని తాండూరు పట్టణ శివారులోని ఖాంజాపూర్ గేట్ సమీపంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయం ప్రాంగణం, మైనార్టీ బాలికల రెసిడెన్సియల్ స్కూల్లో మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రీక విజయలక్ష్మి, తాండూరు పారెస్ట్ ఆఫీసర్ శ్యాం సుందర్ రావుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణం పచ్చగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ కేవీఎం వెంకట్, శ్రీరామ కృష్ణ సేవాసమితి గౌరవాధ్యక్షులు గాజుల బస్వరాజ్, రిటైర్డ్ హెచ్‌ఎం బిచ్చప్ప బీట్ ఆఫీసర్ మల్లప్ప, పాటశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గీతామందిర్‌లో కొనసాగుతున్న హరేరామనామ సప్తాహం

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్‌లోని గీతామందిర్‌లో పరమహంస పరివ్రాజకాచార్య పూజ్య శ్రీఅవధూతేంద్ర సరస్వతీ స్వామి 49వ పుణ్య ఆరాధన మహోత్సవంలో భాగంగా హరేరామ నామ సంకీర్తన సాప్తాహం నిర్వహిస్తున్నారు. శ్రీసదానంద యోగీశ్వరుల అధ్యక్షతన ఈనెల 1 నుంచి నిత్యం హరేరామ నామ సప్తాహం పూజ, భజన కార్యక్రమాలు జరుగుతున్నాయి. 108 హనుమాన్ చాలీసా పారాయణం, హరేరామ నామ సప్తాహం ఈనెల 7 వరకు కొనసాగుతుది. ఈనెల 8న స్వామి ఆరాధన పూజ, 9న హరేరామ నామ సప్తాహం ముగింపు, మంగళహరతీ జరుగుతుందని శ్రీమద్భగవద్గీత భక్త సమాజం నిర్వహకులు తెలిపారు. ఈసందర్భంగా గీతామందిర్‌లో నిత్యం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని భక్తులు పాల్గొనాలని కోరారు.

## ఈటల గెలుపుపై ఎంపిపి హర్షం..సన్మానం



ఎంపీగా ఎన్నికైన రాజేందర్‌ను సన్మానిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపొందడంతో ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంపిపి సుదర్శన్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా ఆయన నివాసానికి వెళ్లి ఈటల రాజేందర్‌ను కలిసి పూలదండ వేసి శాలువాతో సన్మానించారు. బాణాసంచా కాల్చి కార్యకర్తలకు మిఠాయిలు తినిపించారు. మల్కాజ్‌గిరిలో బిజెపి గెలుపుకోసం కష్టపడి కృషి చేసిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. మల్కాజ్‌గిరి ఓటర్లు ధర్మం వైపు నిలబడి ఓటు వేసి కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చి పీఎం మోదీ నాయకత్వాన్ని మరోసారి కోరుకున్నారని ఎంపిపి పేర్కొన్నారు.

## నాడు ప్రశ్నించే గొంతుగా మల్కాజ్‌గిరి ఎంపిగా సిఎం రేవంత్‌రెడ్డి

- - నేడు ప్రశ్నించే గొంతుగా మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్ గెలుపు
- -మేడ్చల్ జిల్లా బిజెపి శ్రేణుల్లో జోష్ నిచ్చిన మల్కాజ్‌గిరి ఎంపి ఫలితాలు
- -కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను కలవరపెట్టిన ఎన్నికల ఫలితాలు
- -స్థానిక సంస్థలకు మరింత బలోపేతం కానున్న జిల్లా బిజెపి నాయకత్వం

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి),జూన్ 5, ప్రభాతవార్త**

గత ఐదేళ్ల క్రితం జరిగిన ఎంపి ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుగా కాంగ్రెస్ నుంచి మల్కాజ్‌గిరి ఎంపిగా (సిఎం) ఎ.రేవంత్‌రెడ్డి గెలుపొందగ, ఈ ఎన్నికల్లో అదే తరహాల్లో బిజెపి నుంచి మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందటం చర్చనీయాంశంగా మారింది. మల్కాజ్‌గిరి ఎంపి నియోజకవర్గ ప్రజలు ఐదేళ్ల కోసారి మార్పును కోరుకోవటం ప్రాధాన్యతను సంతరించుకుందని చెప్పవచ్చు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో మల్కాజ్‌గిరి ఎంపి ఎన్నికల ఫలితాలు బిజెపి శ్రేణులను ఉత్సాహంతో పాటు మరింత జోష్‌ని నింపిందని చెప్పవచ్చు. బిజెపి నాయకుల్లో, కార్యకర్తల్లో ఉత్సాహంతో పాటు పార్టీ భవిషత్‌కు మరింత ఊరట లభించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మల్కాజ్‌గిరి ఎంపిగా బిజెపి నుంచి ఈటల రాజేందర్ గెలుపొందటం చర్చనీయాంశంగ మారింది. అయితే మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపుతో మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్ 3,91,475ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రతి రౌండ్‌లోనూ మొదటి రౌండ్ నుంచి 21చివరి రౌండ్ వరకు కూడ బిజెపి అధిక్యత సాధించటం విశేషంగ చెప్పవచ్చు. మల్కాజ్‌గిరి ఎంపి పరిధిలోని మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్‌బినగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల మెజార్టీ ఓటర్లు ఎంపిగా ఈటల రాజేందర్ బిజెపికి పట్టం కట్టారు. ఓట్ల లెక్కింపులో మొదటి స్థానంలో బిజెపి, రెండో స్థానంలో కాంగ్రెస్, మూడవ స్థానంలో బిఆర్ఎస్ అభ్యర్థులు నిలిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో మల్కాజ్‌గిరి ఎంపి నియోజకవర్గ ప్రజలు మరో సారి ప్రశ్నించే గొంతుగా ఉంటారన్న భావంతో బిజెపి నుంచి ఈటల రాజేందర్‌ను ఎంపిగా గెలిపించి ఉంటారని పలువురు భావిస్తున్నారు. గతంలోనూ 2019లో ఎంపి ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉండటంతో మల్కాజ్‌గిరి ఎంపిగా రేవంత్‌రెడ్డిని (కాంగ్రెస్) నియోజకవర్గ ప్రజలు ప్రశ్నించే గొంతుగా గెలిపించిన సంగతి తెలిసిందే. అదే తంతులో నాడు తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉంటే ఎంపిగా కాంగ్రెస్‌ను గెలిపించారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే మల్కాజ్‌గిరి ఎంపి నియోజకవర్గ ప్రజలు బిజెపిని గెలిపించారని ప్రశ్నించే గొంతు తరహాలోనే ఈటల రాజేందర్‌ను ఎంపిగా గెలిపించారని పలువురు భావిస్తున్నారు. అదే విధంగ కేంద్రంలో నరేంద్ర మోదీని చూడటంతో పాటు అయోధ్య రామమందిర నిర్మాణం పూర్తి కూడ ఆయనకు బిజెపికి కలిసి వచ్చిందని పలువురు భావిస్తున్నారు. తెలంగాణలో ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సమానంగా బిజెపి ఎంపి సీట్లు రాణించటం రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగ మారింది. అయితే బిఆర్ఎస్ ఓట్లు ఎక్కువగా బిజెపికి క్రాస్ ఓటింగ్ జరిగినట్లు కూడ ఈ విషయం చర్చనీయాంశంగ మారింది. ఇక మల్కాజ్‌గిరి బిజెపి అడ్డగ మారనుందని బిజెపి శ్రేణులు భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నుంచి కూడ కొంత మేరకు బిజెపికి క్రాస్ ఓటింగ్ జరిగి ఉంటుందని అందుకే భారీ మెజార్టీ ఈటల రాజేందర్‌కు వచ్చిందని, గతంలో తెలంగాణలో ఈటల రాజేందర్ రెండుసార్లు మంత్రిగా, తెలంగాణ ఉద్యమనాయకునిగా రాణించటంతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో రెండు చోట్ల బిజెపి నుంచి పోటీ చేసి ఓటమిని చవి చూశారని, గతంలో ఐదేళ్ల కిందట కొడంగల్‌లో నాడు ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఓటమిని చవి చూస్తే మరో మూడు నెలల్లోనే మల్కాజ్‌గిరి ఎంపి నియోజకవర్గ ప్రజలు ఆదరించి కాంగ్రెస్ నుంచి ప్రశ్నించే గొంతుగా ఎంపిగా రేవంత్‌రెడ్డిని గెలిపించిన సంగతి కూడ తెలిసిందే. అదే తరహాలో మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్‌ను బిజెపి నుంచి గెలిపించారని అంటున్నారు. మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్ బిజెపి నుంచి గెలుపొందటంతో ఇక రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బిజెపి మరింత బలోపేతం అయి నాయకత్వం పెరగవచ్చని పలువురు భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మల్కాజ్‌గిరి ఎంపి ఎన్నికల్లో బిజెపి నుంచి ఈటల రాజేందర్‌ను గెలిపించటం బిజెపి శ్రేణుల్లో మరింత జోష్ నింపిందని చెప్పవచ్చు. వివిధ నియోజకవర్గాల్లోనూ బిజెపి శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు.



మేడ్చల్ జిల్లాలో మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్ గెలుపొందటంతో ఉత్సాహంలో బిజెపి శ్రేణులు

## నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరుకు చర్యలు

### -జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

**కొడంగల్,జూన్ 5ప్రభాతవార్త**

పట్టణంలోని ఓ ఫర్టిలెజర్ దుకాణంలో వరి విత్తనాలు కొనుగోలు చేసి సరైన దిగుబడి రాక నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ హామీ ఇచ్చారు. బుధవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో నష్టపోయిన రైతులతో జేడీ మాట్లాడారు. వరి విత్తనాలు తయారు చేసిన కంపెనీ వారితో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎకరాకు వంద బస్తాలు దిగుబడి వస్తాయనే నమ్మకంతో కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. ఆశించిన మేర దిగుబడి రాక నష్టం జరిగిందని రైతులు జేడీఏ దృష్టికి తీసుకువచ్చారు. విత్తనాల విషయంలో విచారణ జరిపి సదురు కంపెనీపై చర్యలు తీసుకుంటామని జేడీఏ గోపాల్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి జూన్ 15న రైతులతో మళ్ళీ సమావేశం ఏర్పాటు చేసి పరిహారం ఎంత ఇవ్వాలనే విషయాన్ని నిర్ణయిస్తామన్నారు. జిల్లాలో ఎవరైనా దుకాణదారులు నకిలీ విత్తనాలు, నాసిరకం విత్తనాలు, గడువు ముగిసిన విత్తనాలు విక్రయిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అండగా ఉంటూ ఏవైనా సమస్యలు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు రైతుల పక్షాన మాట్లాడుతు రెక్కాడితే కాని డొక్కాడని రైతులకు న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారం భం అవుతున్నందున రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా త్వరలో సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏఓలా వణ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీఏ గోపాల్

## కుక్కల దాడిలో తీవ్ర గాయాలైన జింక

**బంట్వారం, జూన్ 5 ప్రభాతవార్త:** కుక్కల దాడిలో ఓ జింక తీవ్రగాయలైన సంఘటన మండల సరిహద్దు గ్రామమైన బొపునారం-కుంచావరం గ్రామ సరిహద్దులో చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బొప్పునారం గ్రామ శివారులోని కుంచావరం గొల్ల రామచంద్రి మొక్కజొన్న పొలంలో జింక ను చుట్టుముట్టి కుక్కలు దాడి చేస్తుండగా రైతు గమనించి వాటిని తరిమి వేశారు. దీంతో జింక అప్పటికే తీవ్రగాయమై బొపునారం వైపు పరుగు పెట్టింది. ఎలాగో దాన్ని కొంతమంది రైతులు కలిసి పట్టుకొని అక్కడి ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. దీంతో వారు గాయాలైన జింక ు కుంచవరం పశువుల ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సంఘటనపై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భా నుప్రతాప్ ను వివరణ కోరగా సుమారు రెండున్నర సంవత్సరాలు వయసున్న ఈ జింక అటవీ ప్రాంతం నుండి పంట పొలాలకు వచ్చినట్టు తెలిసిందని చెప్పారు. అయితే సరిహద్దులోని తట్టేపల్లి, బొప్పు నారం మగ్దుంపూర్ అటవి పరిసరాల నుండి ఇక్కడికి వచ్చి ఉంటుందన్నారు. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని విచారిం చామని ఆయన తెలియజేశారు. చికిత్స అనంతరం జింకను గుల్బర్గా జూ పార్కుకు తరలిస్తామని ఆయన తెలియజేశారు.



తీవ్ర గాయాలైన జింకను పరిశీలిస్తున్నా పారెస్ట్ అధికారులు



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**జహీరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో బుధవారం జహీరాబాద్‌లోని కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ మండల కమిటీ చైర్మన్ కె.సూరికృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి జి అనూష కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, వైస్ ప్రెసిడెంట్ మాణెన్న, న్యావాదులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

**రాయిపల్లిలో...**



ప్రపంచ పర్యావరణ దినోత్సవంను జరుపుకుంటున్న దృశ్యం

**మనూర్, జూన్ 5, ప్రభాతవార్త:** మండలంలోని రాయిపల్లిలో బుధవారం ఎస్‌బిఐ ఫౌండేషన్, భవిష్య భారత్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని వైటిసి కేంద్రంవద్ద ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రం వద్ద మొక్కలు నాటారు. భవిష్య భారత్ సభ్యులు జహంగీర్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా ఎస్‌బిఐ ఫౌండేషన్ సహకారంతో గ్రామ సేవా కార్యక్రమం ద్వారా అనేక పనులను చేయడం జరిగిందని, అందులో పర్యావరణానికి సంబంధించి 2 చెక్ డ్యాంల నిర్మాణం చేశామన్నారు. 5 గ్రామాల పంచాయితీ సభ్యులతో కలసి 5వేల మొక్కలు, సీడ్ బాల్స్ నాటడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భవిష్య భారత్ సభ్యులు ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## బోరంచ నల్లపోచమ్మ ఆలయ ఇఒగా శివరుద్రప్ప



బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఈఓ శివరుద్రప్ప

**మనూర్, జూన్ 5, ప్రభాతవార్త:** మండలంలోని బోరంచ గ్రామంలో కొలవై ఉన్న శ్రీనల్లపోచమ్మ ఆలయ ఈఓగా శివరుద్రప్ప బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈఓగా బాధ్యతలు స్వీకరించి శిరుద్రప్ప ఆలయంలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇఒగా బాధ్యతలు స్వీకరించిన శివరుద్రప్పకు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు చేసి శాలవాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ స్వామి సిద్దుస్వామి, నాగయ్యస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాధికారిగా నెనావత్ శంకర్

**పుల్కల్, జూన్ 5, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండల విద్యాధికారిగా విధులు నిర్వహించిన డి.అంజయ్య మే 31న పదవీ విరమణ పొందడటంతో నెనావత్ శంకర్‌ను మండల విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించారు. కోహీర్ మండల విద్యాధికారిగా, ఆత్మకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న నెనావత్ శంకర్‌ను (9948888502) పుల్‌కల్, చౌటకూరు మండలాల విద్యాధికారిగా బదిలీ చేస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

## రఘునందన్‌రావును కలిసిన బిజెపి నాయకులు



రఘునందన్‌రావును సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**రాయపోల్ జూన్ 5, ప్రభాతవార్త :** మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఆయనను బుధవారం మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింలు, బిజెపి నాయకులు సత్యపాల్‌రెడ్డి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలలో రఘునందన్‌రావు మెదక్ ఎంపీగా గెలుపొందడంతో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకంక్షాలు తెలియజేశామన్నారు. ఎంపీని కలిసిన వారిలో బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో టిడిపికి పూర్వ వైభవం తీసుకొస్తాం

### నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్

**హుస్నాబాద్, జూన్ 5 ప్రభాతవార్త :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బత్తుల శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీతో గెలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తున్న సందర్భంగా బుధవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ నాయకులతో కలసి బాణసంచాలు కాల్చి సంబరాలు జరుపుకుని స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి ప్రజలు అరాచక పాలనకు స్వస్తిపలికి టిడిపి,జనసేన,బిజెపి కూటమిలకు అధికారం కట్టబెట్టారన్నారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబునాయుడు నాలుగవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారన్నారు.ఇక రానున్న రోజుల్లో పార్టీకి మంచి రోజులు వస్తున్నాయని తెలంగాణలో సైతం పార్టీకి మరల పూర్వవైభవం తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తుల శంకర్,ఎండి హస్సన్ ఆకుల వెంకటేష్,వరికోలు రవిందర్, నర్సా రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు జరుపుకుంటున్న టిడిపి నాయకులు



# రైతులను కన్నీరు పెట్టిస్తున్న అధికారులు

- పట్టించుకోని జిల్లా అధికారులు
- ఆందోళనకు దిగనున్న రైతులు

**అల్లాదుర్గం, జూన్ 5, ప్రభాతవార్త:**
జొన్నల కొనుగోలు కేంద్రం మూసివేయడంతో రైతులు కన్నీరు కారుస్తున్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లగా టోకెన్లు ఇచ్చి రేపు మాపు అంటూ కాలయాన చేసి ఇప్పుడు కొనుగోలు చేయమని చేతులు ఎత్తేయడంతో రైతులు పరిస్థితి దయనీయంగా మారింది. జొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని సొసైటీ అధికారులకు వినతిచేస్తున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జొన్నలు కొనుగోలు చేయడం లేదని రైతులు సంబంధిత అధికారులు, జిల్లా ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లగా కొనుగోలు కేంద్రానికి తెచ్చిన జొన్నలు మధ్యాహ్నం వరకు కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చినా సాయంత్రమైనా కొనుగోలు చేయడం లేదని రైతులు లబోదిబో మంటున్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

రైతుల నుంచి జొన్నల ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే గురువారం రెవెన్యూ కార్యాలయం ముందు ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరించారు. రైతుల వద్ద జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే గురువారం రైతులు నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తామని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నరసింహులు పేర్కొన్నారు.



బండి గెలుపుతో సంబరాలు చేసుకుంటున్న బిజెపి నాయకులు

## బండి గెలుపుతో బిజెపి నాయకుల హర్షం

**హుస్నాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** కరీంనగర్ పార్లమెంట్ సభ్యులుగా బండి సంజయ్‌కుమార్ గెలుపొందడం పట్ల బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ శ్రేణులతో కలసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.అంతకు ముందు హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులుగా బండి సంజయ్‌కి ప్రజలు రెండు లక్షల పై చిలుకు మెజారిటీ ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు.ప్రజలు ఇచ్చిన ఈ గెలుపుతో పార్టీకి బాధ్యత పెరిగిందని రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయాలని ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, నాయకులు లక్కిరెడ్డి తిరుమల,మాజీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు, మాజీ అక్కన్నపేట మండల అధ్యక్షులు గొల్లపల్లి వీరాచారి,బద్దిపడగ జైపాల్‌రెడ్డి,గుత్తికొండ విద్యాసాగర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో...**

మండలంలోని మల్చేరుతండాలో గిరిజన మోర్చ మాజీ మండల అధ్యక్షులు బానోతు అనీల్ నాయక్ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులుగా బండి సంజయ్ భారీ మెజారిటీతో గెలిసి రెండవ సారి పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలసి బాణసంచాలు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు.బండి సంజయ్‌కి ఓటు వేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## నాణ్యమైన విద్య ప్రభుత్వ కళాశాలలోనే సాధ్యం

**చిన్నశంకరంపేట, జూన్ 5, ప్రభాతవార్త:** నాణ్యమైన విద్య ప్రభుత్వ కళాశాలలో సాధ్యమవుతుందని ప్రిన్సిపల్ నాగేందర్ తెలిపారు. బుధవారం నాడు పట్టణంలో పదవతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లి,తండ్రులతో మాట్లాడి కళాశాల ప్రాముఖ్యతపై వారికి వివరించారు. ప్రభుత్వ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపల్ నాగేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ ఉచిత విద్యను, క్రమశిక్షణతో అందించడం జరుగుతుందన్నారు. ఇటువంటి సౌకర్యాన్ని చిన్నశంకరంపేట మండల పరిసర ప్రాంతాల 10వ తరగతి పూర్తి అయిన విద్యార్థులు అందిపుచ్చుకొని వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఈ సంవత్సరం ఇంటర్ ఫలితాలలో ఉమ్మడి మెదక్ జిల్లాలోనే చిన్నశంకరంపేట మొదటి స్థానంలో నిలిచి ఆదర్శంగా నిలిచిందన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరంకు అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. జనరల్ గ్రూపులలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపులలో ఓఎ, ఏ అండ్ టీ, సీఎస్ కోర్సులు, ఇంగ్లీష్, తెలుగు మాధ్యమంలో బోధించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు కళాశాలకు నేరుగా వచ్చి దరఖాస్తులను సమర్పించాలన్నారు. దరఖాస్తులు ఇచ్చిన వెంటనే అడ్మిషన్లు ధృవీకరించి ఇస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నాగేందర్



ఎస్ఐ మహమ్మద్ గౌస్‌ను సన్మానిస్తున్న ప్రభాకర్‌గుప్త, పుర్ర ప్రభాకర్, పద్మయ్య

## ఉత్తమ సేవాపతకం అందుకున్న ఎస్ఐకు సన్మానం

**కొల్చారం, జూన్ 5 ప్రభాతవార్త:**
తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా కొల్చారం మండల ఎస్ఐ మహమ్మద్ గౌస్ ఉత్తమ సేవ పతకం అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం రేషన్ డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజాంపురం ప్రభాకర్‌గుప్త, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్, సంగాయిపేట మాజీ సర్పంచి పద్మయ్య ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, జూన్ 5 ప్రభాతవార్త:** మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని శేరిలా గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు, తలిదండ్రులతో కలిసి బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ వరలక్ష్మీ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం ద్వారా ఆరోగ్యకరమైన పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించబడుతుందన్నారు. పిల్లలకు ఆట వస్తువులతోపాటు ఆడించడం జరుగుతుందని, దీని ద్వారా వారి మానసిక స్థితి మెరుగుపడుతుందన్నారు. చిన్నారులకు మెరుగైన ఆరోగ్యం, మంచి విద్యతో వారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం ఆరు నెలల నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు దేవలత, లక్ష్మీ, ఎంపీహెచ్‌వో కృష్ణవేణి, ఏఎన్ఎం స్రవంతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్‌కు సన్మానం

**సిద్దిపేట రూరల్, జూన్ 5, ప్రభాతవార్త :** పార్లమెంటు ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ ఎంపిగా విజయం సాధించిన సురేష్ షెట్కార్‌ను సిద్దిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరకుల శివప్ప బుధవారం హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పాటు కేంద్ర నిధులతో ఎంపి సురేష్ షెట్కార్ నేతృత్వంలో జహీరాబాద్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.



జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న శివప్ప

# బిజెపితో బిఆర్ఎస్ పార్టీ కుమ్మక్కు

**నర్సాపూర్ జూన్ 5, ప్రభాతవార్త :**
మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పార్టీతో బిఆర్ఎస్‌పార్టీ కుమ్ముక్కుఅయ్యాయని పేర్కొంటు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు దే నైతిక విజయమని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి లు అన్నారు.బుధవారం వారు నర్సాపూర్‌పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమాజీ మంత్రి హరీష్‌రావు తెరవెనక రాజకీయం చేసి బిజెపి పార్టీతో కుమ్ముక్కై బిజెపి పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించారని వారు ఆరోపించారు. సిద్దిపేటలో బిఆర్ఎస్ అభ్యర్థి కి లక్ష మెజార్టీ అందిస్తానని ప్రకటనలు చేసి కేవలం 2 వేల మెజార్టీ అందించడంలోఅంతర్యమేమిటని ప్రశ్నించారు.దీంతో వారు ఇరుపార్టీలు కుమ్ముకైనట్లు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్,మాజీ మంత్రి హరీష్‌రావులు బిజెపి పార్టీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకున్నారని తెలిపారు.ఈ మేరకు బిఆర్ఎస్ పార్టీని బిజెపి లో విలీనం చేయాలని వారు సూచించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధుకు నర్సాపూర్ నియోజకవర్గం నుండి 18 వేల ఓట్లు అందించామని అన్నారు.ఈ మెజార్టీ సాధించేందుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తలకు పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు. నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారని అన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి నీలం మదు దే నైతిక విజయమని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు కాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర నాయకులు రవిందర్‌రెడ్డి, సుహాసినిరెడ్డి,ఎంపిపి జ్యోతి సురేష్‌నాయక్, సీనియర్ కాంగ్రెస్‌నాయకులు శ్రీనివాస్‌గుప్త మాజీ ఎంపిపి లు లలితనర్సింగ్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్,మండల అధ్యక్షులు మల్లేషం, నాయకులు హకీం,రుస్తుంపేట ఎంపిటిసీ అశోక్, మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌కుమార్, నాయకులు రాధాకృష్ణాగౌడ్, మండల బిసి సెల్ అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ రశీద్, మండల మైనార్టీ అధ్యక్షులు అజ్మత్, నాయకులు హబీబ్‌ఖాన్, ఎద్దు మల్లేష్‌యాదవ్, రవిగౌడ్, అల్తాప్, శివ్వంపేట నర్సింహ్మచారి కాంగ్రెస్ నాయకులు ,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి




మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి



మనూర్‌లో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

## మనూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**మనూర్, జూన్ 5, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌కుమార్ శెట్కార్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బిబి పాటిల్‌కు భారీ మెజార్టీతో ఎంపిగా విజయం సాధించడంతో మనూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. మండలంలో కాంగ్రెస్‌కు 8629 కోట్లు, బిజెపికి 5680, బిఆర్ఎస్‌కు 3172 ఓట్లు పోవటంతో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌కుమార్ శెట్కార్‌కు 2949 ఓట్ల మెజార్టీ దక్కింది. ఇదిలా ఉండగా మనూర్‌లో 24 ఓట్లు, మైకోడ్‌లో 244 ఓట్లు బిజెపికి అధిక్యం దక్కింది. సురేష్‌శెట్కార్ ఎంపిగా విజయంసాధించడంతో పార్టీ నాయకులు టపాసులు కాలుస్తూ మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

**నాగల్‌గిద్దలో...**



నాగల్‌గిద్దలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, జూన్ 5, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులుగా సురేష్‌కుమార్ శెట్కార్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బిబి పాటిల్‌పై ఘన విజయం సాధించడంతో నాగల్‌గిద్దతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు, సురేశ్‌కుమార్ శెట్కార్ అభిమానులు ఆనందోత్సవాలతో బుధవారం సంబరాలు చేసుకున్నారు. పటాకులు కాలుస్తూ, మిఠాయిలు తినిపించుకుంటూ నృత్యాలు చేస్తూ జై కాంగ్రెస్, జై జై సురేశ్ శెట్కార్ లాంటి నినాదాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలోని దత్తాత్రి ఆలయంలో పార్టీ శ్రేణులు 101 కొబ్బరి కాయలు కొట్టి తమ మొక్కుబడిని చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, ఎంపిటిసి సభ్యులు పండరినాథ్‌రావు పాటిల్, యూత్ అధ్యక్షులు ఓంకార్ స్వామి నాయకులు అనిల్ పాటిల్, సంజీవ్ పాటిల్, సంతోష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

**హుస్నాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అంగన్‌వాడీ టీచర్ తిరుమల అన్నారు. బుధవారం హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా అంగన్‌వాడీ హుస్నాబాద్ ప్రాజెక్ట్ కోహెడ సెక్టార్ సముద్రాల గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ తిరుమల పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, బాలింతలతో కలసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసిటిఎస్ ఆదేశాలు హుస్నాబాద్ సిడిపిఓ జయశ్రీ సూచనల మేరకు ఈ మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న జెఏసి కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి

**హుస్నాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి హుస్నాబాద్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలిపిన సిపిఐ, జనసమితి సభ్యులకు ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అప్రజాస్వామిక పద్దతిలో బిజెపికి సహకరించిందన్నారు.బిఆర్ఎస్ బిజెపికి తొత్తుగా మారిందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వీరన్ననాయక్, రాజగోపాల్‌రావు, కేడం లింగమూర్తి, లక్ష్మణ్, చందు, జయపాల్‌రెడ్డి, లక్ష్మీ, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిర్గాపూర్‌లో కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

**సిర్గాపూర్, జూన్ 5, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులుగా సురేశ్‌కుమార్ శెట్కార్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బిబి పాటిల్‌పై భారీ మెజార్టీతో విజయం సాధించడంతో మండల కేంద్రమైన సిర్గాపూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ సంబరాలు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. నాయకులు టపాసులు కాలుస్తూ, నృత్యాలు చేస్తూ మిఠాయిలు పంచుకుంటూ డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సిర్గాపూర్‌లోవిజయోత్సవ సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

# పాతనగరం అభివృద్ధి కోసం కృషి : ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

**చార్మినార్,జూన్ 5 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ అభివృద్ధి కోసం అన్ని విధాల కృషి చేస్తానని ఎఐఎంఐఎం అధ్యక్షులు, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అసదుద్దీన్ ఓవైసీ ఎంపిగా విజయం సాధించిన సందర్భంగా పాతబస్తీ పురానాపూల్‌కు చెందిన హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జీ పుస్తె శ్రీ కాంత్, బిఆర్ఎస్ నాయకులు విష్ణుగౌడ్‌తో పాటు పలువురు కలిసి ఎంపి అసదుద్దీన్ ఓవైసీని శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్తీ అభ్యున్నతి కోసం పాటు పడతానని తెలిపారు. పురానాపూల్‌కు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.



హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపిగా విజయం సాధించిన అసదుద్దీన్ ఓవైసీని కలిసి అభినందనలు తెలియజేస్తున్న నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జీ పుస్తె శ్రీ కాంత్, బిఆర్ఎస్ నాయకులు విష్ణుగౌడ్

# జగన్ పాలనపై ప్రజల విరక్తికి ఈ తీర్పు నిదర్శనం

**చిక్కడపల్లి, జూన్ 5 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజలోన్ల నెలకొన్న విరక్తికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా అభివర్ణించారు. బుధవారం చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వీధిలో మాజీ కార్పొరేటర్, ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యద ర్శి, రామ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎపిలో చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడబోతున్న సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించారు. మిఠాయిలు పంచి ఆనందాన్ని పంచుకున్నారు. సాయిబాబా, బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ జగన్ పాలనలో ఆ రాష్ట్ర ప్రజలు అనుభవించిన కష్టాలను విసుగుచెందిన ప్రజలు ఈ తీర్పుతో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారన్నారు. ఇదే సమయంలో చంద్రబాబునాయుడు పాలనా సమర్థత, జనసేన అధినేత పవన్‌క ల్యాణ్ నిబద్ధత, మోదీ సహకారంతో ప్రజల్లో నెలకొన్న విశ్వాసం, రాష్ట్ర బాగుపడాలన్న ఆకాంక్ష ఈ తీర్పు ద్వారా స్పష్టమైందన్నారు. ఇంత భారీమెజారిటీతో విజయం కట్టబెట్టిన ప్రజల విశ్వాసం నిలబెట్టుకునేలా కూటమి పాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిఎం నాయుడు, శంకరరావు, పి.ఉదయ్‌కుమార్‌గుప్త, శివకృష్ణ, సాయి, రమేశ్‌చారి, పుల్లయ్య వీణాదేవి, తన్వీ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయంలో జ్యోతిషంపై సదస్సు

**నాంపల్లి, జూన్ 5 ప్రభాతవార్త :** జ్యోతిషశాస్త్రంలో ఆసక్తికలిగిన ఔత్సాహికుల కోసం ఈ నెల 23న నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జ్యోతిషంపై సదస్సు నిర్వహిస్తున్నామని ఎన్ఎన్ లైవ్ అస్ట్రో ఆర్యాన్ ఆస్ట్రాలజీ రీసెర్చ్ కేంద్రం జ్యోతిషబ్రహ్మ డా. నరసిం హస్వామి మీడియాకు తెలిపారు. అలాగే ఔత్సాహికుల కోసం జ్యోతిష ప్రవీణ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను కూడా ఆహ్వానిస్తున్నట్లు, ఈ కోర్సులకు సంబంధించిన తరగతులను ఈ నెల 30వ తేదీ నుండి ప్రారంభిస్తున్నట్లు, తరగతులు ఆన్‌లైన్ జూం మాధ్యమం ద్వారా జరుగుతాయని వివరించారు. ఈ కోర్సులకు దరఖాస్తులు చేసుకున్నవారు మాత్రమే 23న ఉదయం 10.30 నుండి జరిగే జ్యోతిష సదస్సుల్లో పాల్గొనవచ్చునని, ఈ కోర్సుల్లో చేరడానికి అర్హత కలిగిన వారికి 70శాతం రాయితీ కల్పించబడుతుందని, కోర్సుల పూర్తి వివరాలు సదస్సులో తెలుపుతామని అన్నారు.

# ఎమ్మెల్యేలుగా గెలిచినా...సొంత నియోజవర్గాల్లో వెనుకంజ

**-ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ రెండోస్థానం**

**-సికింద్రాబాద్‌లో పద్మారావుగౌడ్ మూడోప్లేస్**

**-ఆరునెలల్లో మారిన సమీకరణాలు**



ఎమ్మెల్యే దానం



ఎమ్మెల్యే పద్మారావు

**హైదరాబాద్, జూన్ 5,ప్రభాతవార్త:** సికింద్రబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన దానం నాగేందర్, బిఆర్ఎస్ నుంచి పోటీచేసిన పద్మారావుగౌడ్ ఎమ్మెల్యేలుగా ఉన్న తమ సొంత నియోజకవర్గంలోపూ పట్టుసాధించలేకపోయారు. ఖైరతాబాద్‌లో దానం రెండోస్థానంలో నిలవగా..సికింద్రాబాద్ అసెంబీల్లో పద్మారావు గౌడ్ మూడో స్థానంలో నిలిచారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బిఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన దానం నాగేందర్ ఆతర్వాత కాంగ్రెస్‌లో చేరి ఎంపి అభ్యర్థిగా పోటీచేశారు. కానీ ఇప్పుడు ఇక్కడ బిఆర్ఎస్, కాంగ్రెస్ కాకుండా బిజెపి అభ్యర్థి కిషన్‌రెడ్డికి 16,500 మెజార్టీ వచ్చింది. ముఖ్యంగా నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ ,ఖైరతాబాద్, డివిజన్లలో బిజెపి పూర్తి ఆధిక్యం సాధించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు 67,165 ఓట్లు పోలవ్వగా ఇప్పుడు లోక్‌సభకు వచ్చేసరికి 16,662కు పడిపోయింది. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థికి 45,061 ఓట్లు రాగా, తాజా ఎన్నికల్లో అదనంగా 12,063 ఓట్లు మాత్రం వచ్చాయి. దీంతో బిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి లోక్‌సభలో అభ్యర్థిగా బరిలో నిలవగా ఎమ్మెల్యేగా సాధించిన ఓట్లలో సగమైనా సాధించకపోవడం చర్చనీయంగా మారింది.

సికింద్రాబాద్‌లో...

గతేడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందిన పద్మారావుగౌడ్‌కు 78, 309 ఓట్లు వస్తే అందులో 45,240 మెజార్టీ దక్కింది. కానీ ఇప్పుడు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 28,153 ఓట్లుతో మూడోస్థానంలో నిలిచాడు. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 25,202 ఓట్లకు పరిమితమైన బిజెపి తాజా పార్లమెంట్ ఎన్నికల్లో 62,429 ఓట్లతో పైచేయి సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో 32,983ఓట్లతో రెండోస్థానంలో నిలిచిన కాంగ్రెస్ ఈఎన్నికల్లో 44,905 ఓట్లు సాధించి రెండోస్థానంలో నిలిచింది.

# నగరంలో భారీ వర్షం

**-పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్**

**-వాహనదారుల ఇక్కట్లు**

**-నీట మునిగిన వాహనాలు**





**హైదరాబాద్, జూన్ 05, ప్రభాతవార్త:** నగరంలో మరోసారి భారీ వర్షం బీభత్సం సృష్టించింది. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్ష తాకిడికి ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోయింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో మోకాళ్ళ ఎత్తు నీళ్ళు రాగా, వాహనాలు నీట మునిగాయి. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రజలు ఆఫీసు పని ముగించుకుని కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్ళే సమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాంతో మాధాపూర్, హైటెక్ సిటీ, రాయదుర్గం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, నాంపల్లి, పొట్టి శ్రీరాములు నగర్ వంటి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నెలకొంది. సినీ పరిశ్రమ కార్మికులు, కళాకారులు ఉండే కృష్ణానగర్, ఇందిరానగర్ యూసుఫ్ గుడాలోని వర్షతాకిడికి వరదలు ఏర్పడ్డాయి. అందులో భాగంగా డ్రైనేజీలు లీక్ అయ్యి రోడ్లన్నీ జల ప్రవాహంతో పొంగిపొర్లి చెఱువును తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడుతుండడంతో విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడింది. రెండు తెలుగు రాష్ట్రాలలో నైరుతిఋతుపవనాలు విస్తరించడంతో, ఇప్పటికే వాతావరణ అధికారులు భారీ వర్షాలు పడే సూచనలున్నాయని అలర్ట్ చేసిన విషయం తెలిసిందే.

కాగా రాష్ట్రంలోని బుధవారం రాత్రి, గురువారం రోజుఏన మరికొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాల నుంచి, ఉరుములు మెరుపులతో భారీ వర్ష సూచనలు కనిపిస్తున్నాయని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగం తో ఈదురు గాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది.

## మంత్రి పొంగులేటికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,జూన్ 5 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో తన విజయానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అభినందనలు తెలియాజేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా బుధవారం మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెద్దాల నర్సింహ్మా, నరేశ్, వెంకటేశ్ తదితరుల పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభినందనలు తెలుపుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

# శిల్పాశెట్టి భర్త కేసుని అడ్డు పెట్టుకుని లక్షలు దోచిన సైబర్ నేరగాళ్ళు

**హైదరాబాద్, జూన్ 05, ప్రభాతవార్త:** బాలీవుడ్ నటి శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రా చేసిన రూ.100కోట్ల కుంభకోణంలో తన పేరు కూడా చేర్చారని చెప్పి నగరానికి చెందిన వృద్ధుడిని భయపెట్టిన సైబర్ నేరగాళ్ళు, అతడి ఖాతా నుంచి రూ.15 లక్షలు కాజేసిన వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే, సికింద్రాబాద్‌కు చెందిన ఒక 80 ఏళ్ళ రిటైర్డ్ ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ముంబై అంధేరీ పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నానని, రాజ్‌కుంద్రా చేసిన కుంభకోణంలో తన పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలిందని, ఆయన పేరుమీద మనీల్యాండరింగ్ కేసు నమోదు చేసి సిబిఐకి అప్పగిస్తున్నామని ఫోన్ చేసిన వ్యక్తి చెప్పాడు. అనంతరం బాధితుడి మొత్తం ఆస్తులతో పాటు అతని భార్య నగలను కూడా జప్తు చేస్తామని బెదిరించాడు. ఈ క్రమంలో ఫోన్‌కాల్‌ను సైబర్ క్రైమ్‌కు మళ్ళిస్తున్నామని మరో దొంగకు కాల్‌ను ఫార్వర్డ్ చేశాడు. అప్పటికే



మానసిక ఆందోళనకు గురైన వృద్ధ బాధితుడు సైబర్ కేటుగాళ్ళ మాట నమ్మక తప్పలేదు. దాంతో సుమారు రెండు గంటలకు పైగా కేసు గురించి పలు అబద్ధాలతో వివరిస్తూ వృద్ధుడిని భయభ్రాంతులకు గురి చేశారు. మరుసటి రోజే ఈ సైబర్ నేరస్థులు తెలివిగా పోలీస్ స్టేషన్ సెటప్ చేసుకుని వీడియో కాల్ చేసే ధైర్యం చేశారు. తాము సిబిఐ నుంచి మాట్లాడుతున్నట్లు నమ్మబలికారు. రాజ్ కుంద్రాతో వృద్ధుడికేం సంబంధమంటూ ఆరా తీసి, ప్రివెన్షనాఫ్ మనీ ల్యాండరింగ్ కేసులో అతడిని అరెస్టు చేస్తామని బెదిరించారు. ఈ కేసు నుంచి బయట పడేయాలంటే ఉన్నతాధికారితో మాట్లాడుకోమని ఆదేశించారు. దాంతో ఈ వ్యవహారంలో మరో దొంగ ఎంటరై భాదితుడు దాచుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పాటు, బ్యాంకులో ఉన్న డబ్బు మొత్తం కలిపి రూ.15.86 లక్షలు కొల్లగొట్టాడు. జరగాల్సిన నష్టం జరిగిపోయాకా బెదిరింపులకు పాల్పడిన వాళ్ళ ఫోన్ నెంబర్లు పని చేయలేదు. దాంతో అనుమానమొచ్చిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అతడి నగదు నేరస్థులకు చేరకుండా మనీ ఫ్రీజింగ్‌తో పాటు పోలీసులు పలు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను ట్రేస్ చేసే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

# అగ్నివీర్ పాసింగ్ అవుట్ పరేడ్



పెరేడ్‌లో అగ్నివీర్‌లు

**అల్వాల్, జూన్ 5 ప్రభాతవార్త:** జంటనగరాలులో కొలువు తీరి ఉన్న సైనిక విభాగాలులో బుధవారం అగ్నివీర్‌ల పాసింగ్ అవుట్ పరేడ్‌లు జరిగాయి. సికింద్రాబాద్‌లోని 1 ఇఎంఇ సెంటర్‌లో గత 31 వారాలుగా శిక్షణ తీసుకున్నారు. శిక్షణ పూర్తి చేసిన నేపధ్యంలో పూర్తి స్థాయి సైనికులుగా విధులలో చేరనున్న నేపథ్యంలో అగ్నివీర్‌ల పాసింగ్ అవుట్ పరెడ్ జరిగింది. పాసింగ్ అవుట్ పరెడ్‌కు ముఖ్య అతిథిగా 1 ఇఎంఇ సెంటర్ కమాండెంట్ బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్ పాల్గొని అగ్నివీర్‌లు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మెహిదీపట్నంలోని ఆర్టీలరీ సెంటర్‌లో కూడా పాసింగ్ అవుట్ పరెడ్ జరిగింది. సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసిన 2517 మంది అగ్నివీర్ గన్నర్స్ నిర్వహించిన పరెడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్టీలరీ విభాగం కల్నల్ కమాండెంట్ లెఫ్ట్‌నెంట్ జనరల్ రాహుల్ సింగ్ ముఖ్య అతిథిగా పాసింగ్ అవుట్ పరెడ్‌కు విచ్చేశారు. అగ్నివీర్‌లు నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఆయన దేశ రక్షణలో అడుగు పెడుతున్న యువ సైనికులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాలులో పెద్ద సంఖ్యలో సైనిక ఉన్నతాధికారులు అగ్నివీర్‌లకు చెందిన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ భవన్ ముందు దురుసు ప్రవర్తన

**-టిడిపి కార్యకర్తలపై కేసు**

**హైదరాబాద్, జూన్ 05, ప్రభాతవార్త:** సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి రెచ్చగొట్టేలా ప్రవర్తించిన తెదేపా నాయకులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. తెలంగాణ భవన్ వద్ద బందోబస్తులో ఉన్న కానిస్టేబుల్ సమాచారమందించడంతో అల్లర్లు చెలరేగేలా ప్రవర్తించిన వారిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే, ఆంధ్రరాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం సాధించిన సందర్భంగా కొంతమంది కార్యకర్తలు హైదరాబాద్‌లో హల్‌చల్ చేశారు. బంజారాహిల్స్ ప్రాంతంలో ఉన్న తెలంగాణ భవన్ వద్ద కారును ఆపిన పలువురు టీడీపీ జెండాలను ప్రదర్శిస్తూ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అల్లర్లు జరిగేలా, ఓటమి పాలైన నేతలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని అక్కడే బందోబస్తు విధులలో ఉన్న కానిస్టేబుల్ శివరాజ్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారమివ్వడంతో వారిని అడ్డుకున్నారు. ఈ మేరకు నిందితులపై ఐపీసీ సెక్షన్188, 153 ఏ,బీ, 185 ఏ, మోటార్ వెహికల్ యాక్ట్ కింద పలు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## జానీ మాస్టర్ వేధింపులపై పోలీసులను ఆశ్రయించిన డ్యాన్సర్

**గచ్చిబౌలి, జూన్ 5 ప్రభాతవార్త** తనను షూటింగులకు పిలువకుండా, ఇండస్ట్రీలో అవకాశాలు రాకుండా జానీ మాస్టర్ వేధింపులకు గురిచేస్తున్నాడని వాపోతూ ఓ డ్యాన్సర్ రాయదుర్గం పోలీసులను ఆశ్రయించాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈసంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... తెలుగు ఫిలిం అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న జానీ మాస్టర్ తనను వేధింపులకు గురిచేస్తున్నాడని డ్యాన్సర్ సతీష్ బుధవారం రాయదుర్గం పోలీసులను ఆశ్రయించాడు. అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్‌లో సమస్యల మీద ప్రశ్నించినందుకు జానీ మాస్టర్ తన మీద పగపెంచుకున్నాడని పిర్యాదులో తెలిపాడు. షూటింగ్‌లకు తనను పిలువవద్దని యూనియన్ సభ్యులతో జానీ మాస్టర్ ఫోన్ చేయిస్తున్నాడని, తనకు అవకాశాలు రాకుండా అడ్డుకుంటున్నాయని వాపోయారు. తనకు షూటింగ్స్ అవకాశాలు కల్పించిన మాస్టర్స్, కోఆర్డినేటర్లను బెదిరించడంతో పాటు ఫైన్లు విధిస్తున్నాడని అన్నారు. జానీ మాస్టర్ కక్షపూరిత చర్యల కారణంగా గత నాలుగు నెలలుగా ఉపాధి లేకుండా ఇబ్బంది పడుతున్నట్లు డ్యాన్సర్ సతీష్ పిర్యాదులో పేర్కొన్నాడు. కాగా సతీష్ పిర్యాదును స్వీకరించిన రాయదుర్గం పోలీసులు ఈ విషయాన్ని ఫిలింఛాంబర్ ద ృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం.

# వరదనీరు సమస్యల లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

**-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశం**

**హైదరాబాద్, జూన్ 5,ప్రభాతవార్త:** వరదనీరు సమస్య లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ అధికారులు అందేశించారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ, ఖైరతాబాద్ ప్రాంతాల్లో కమిషనర్ ఈఎసి జియాఉద్దీన్‌తో కలిసి మెర్క్యురీ తాజ్ కృష్ణ హోటల్‌వద్ద వాటర్ స్టాగ్నేషన్ పాయింట్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ వదనద నుంచి వచ్చే వరదనీరు నేరుగా వెళ్లేందుకు మెర్క్యూరీ, తాజ్ కృష్ణ హోటల్, ఆర్‌టిఏ కార్యాలయం లెక్ర్యూ గెస్ట్‌హౌజ్ వద్ద సంపులు నిర్మించుటకు ప్రతిపాదనలు పంపాలని ఈఈని అదేశించారు. ఈకార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ ఎస్ఈ రత్నాకర్, ఈఈ ఇందిరాబాయిపాల్గొన్నారు.



వాటర్ స్టాగ్నేషన్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రోనాల్డ్‌రోస్

# 12 నుంచి టిటిడి శ్రీవారి దేవాలయం వార్షిక బ్రహోత్సవాలు

**-భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎఇఓ విజ్ఞప్తి**



బ్రహోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమేష్‌బాబు. చిత్రంలో త్రినాధ్‌బాబు తదితరులు

**సైఫాబాద్, జూన్ 5 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి) శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం బాలాజీ భవన్ 19వ వార్షిక బ్రహోత్సవాలు ఈ నెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహిస్తున్నామని టిటిడి ఎఇఓ రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేవాలయం లోకల్ అద్వయిజరీ కమిటి మాజీ ఉపాధ్యక్షుడు వై.టి.వి.త్రినాధ్‌బాబుతో కలిసి ఆయన ఈ బ్రహోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 12వ తేదీ సాయంత్రం అంకురార్పణతో ఈ బ్రహోత్సవాలు పారంభమవుతాయని తెలిపారు. 13వ తేదీ ఉదయం ధ్వజారోహణం, ఆ తరువాత శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఊరేగింపు పురవీధుల్లో, రాత్రి 8 గంటలకు శ్రీహనుమంత వాహనంపై కూడా ఊరేగింపు కొనసాగుతుందని, 14వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనంపైన స్వామివారి ఊరేగింపు జరుగుతుందని, తదనంతరం స్నపన తిరుమంజనం, రాత్రి 8 చంద్రప్రభ వాహనంపై స్వామివారి ఊరేగింపు వైభవంగా జరుగుతందన్నారు. 15వ తేదీ ఉదయం 8 గంటలకు గజవాహనంపై స్వామివారి ఊరేగింపు, 10 గంటలకు శాంతి కళ్యాణం, రాత్రి 8 గంటలకు గజవాహనంపై స్వామివారి ఊరేగింపు కొనసాగుతుందని, 16వ తేదీ ఉదయం 8 గంటలకు శ్రీవారి రథోత్సవం కన్నుల పండువగా జరుగుతుందన్నారు రాత్రి 8 గంటలకు అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు, 17వ తేదీ 9.30 గంటలకు మహాపూర్ణాహుతి, 10.30 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు శ్రీవారికి పుష్పయాగం, రాత్రి 9 గంటలకు ధ్వజారోహణం జరుగుతాయని ఆయన వివరించారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామి వారికి సుప్రభాతం, తోమాల, ఆరాధన, సహస్రనామార్చన, ప్రథమ గంట, హవన నిర్వహణ, ద్వితీయ గంట, భక్తులకు సర్వ దర్శనం అనంతరం ఆలయం శుద్ధి, సర్వదర్శనం, శుద్ధి, తృతీయ గంట, సేవా, పూర్ణాహుతి, బలిహరణ, రాత్రి 9.30 గంటలకు స్వామివారి ఏకాంత సేవా జరుగుతాయని ఆయన వివరించారు. పై కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి రోజు శ్రీవారి లడ్డు ప్రసాద విక్రయం కొనసాగుతుందని, అలాగే ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

## జూపార్కు ప్రవేశ టిక్కెట్లు ఎక్కువ ధరకు విక్రయించటం లేదు

**-జూపార్కు క్యూరేటర్ సునీల్ హీరామత్**

**చార్మినార్,జూన్ 5 ప్రభాతవార్త :** జూపార్కు ప్రవేశ టిక్కెట్లను ఎక్కువ ధరకు విక్రయించటం లేదని నెహ్రూ జూలాజికల్ పార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హీరామత్ తెలిపారు. జూపార్కు ప్రవేశ టిక్కెట్లు 70 రూపాయలకు బదులుగా 100రూపాయలకు విక్రయిస్తున్నట్లు సోషల్ మీడియాలో వ్యాపించిన విషయం అవాస్తవమని ఆయన తెలియజేశారు. జూ పార్కు ప్రవేశ టిక్కెట్ పెద్దలకు 70 రూపాయలు, చిన్నారులకు 45 రూపాయలు, కాగా శని, ఆదివారాలతో పాటు సెలవు రోజులలో పెద్దలకు 80 రూపాయలు, చిన్నారులకు 55 రూపాయలుగా టిక్కెట్లను అమ్ముతున్నామని జూపార్కు క్యూరేటర్ హీరామత్ తెలియజేశారు.

## ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు...వాహనాలు స్వాధీనం

**చిక్కడపల్లి, జూన్ 5 ప్రభాతవార్త:** ద్విచక్రవాహనాలను దొంగిలించి తప్పించుకు తిరుగుతున్న ఒక వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నగరంలోని ఆర్‌కె.పురంకు చెందిన సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న హరిసింగ్ కుమారుడు అమర్ సింగ్(28) గత కొంత కాలంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ద్విచక్రవాహనాలను దొంగతనం చేయడం ప్రారంభించారు. ఇటువంటి దొంగతనాలను చేసి గతంలో ఉప్పల్, గోపాలపురం, తుకారాంగేట్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన కేసుల్లో జైలుకు వెళ్లి తిరిగి వచ్చారు. అయినా కూడా దొంగతనాలను చేయడం మానలేదు. ఇప్పటివరకు నేరేడ్‌మెట్, మేడిపల్లి, మార్కెట్ పిఎస్ పరిధిలో దొంతనాల కేసులు నమోదు అయి ఉన్నారు. కాగి గత నెల 29న అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన జయప్రకాశ్ అగర్వాల్‌కు చెందిన హోండా యాక్టీవా వాహనం ఇంటి ముందు పార్కు చేసి ఉంటే దొంగతనానికి గురైనట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసును నమోదు చేసిన చిక్కడపల్లి పోలీసులు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్సు సహకారంతో విసృతంగా ధర్యాప్తు, గాలింపులు జరపగా అమర్‌సింగ్‌ను అనుమానాస్పదంగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ జరపగా చేసిన దొంగతనాలను అంగీకరించారు. నిందితుడిని అరెస్టు చేసి నాంపల్లి తొమ్మిదవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్‌కు కోర్టు ఆదేశించింది. కాగా ఇతడి వద్ద నుంచి పలు ద్విచక్రవాహనాలను స్వాధీనంచేసుకున్నారు. ఇన్స్‌పెక్టర్ ఏరుకొండ సీతయ్య పర్యవేక్షణలో అడ్మిన్ ఎస్ఐ నాగరాజు కేసును దర్యాప్తు నిర్వహించారు.



ద్విచక్రవాహనాల దొంగను అరెస్టు చేసిన దృశ్యం

## నిద్రిస్తున్న వాచ్‌మెన్‌పై వెళ్ళిన కాంక్రీట్ లారి..

**-అక్కడిక్కడే మృతి చెందిన వాచ్‌మెన్..**

**పేట్ బషీరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** నిర్మాణ దశలో ఉన్న బహుళ అంతస్తుల భవనం వద్ద పడుకుని ఉన్న వాచ్‌మెన్‌పై కాంక్రీట్ వాహనం వెనకాల టైర్ల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రాంనారాయణ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన హరిరాంసింద్ యాదవ్ (40) గత వారం రోజుల కిందట కొంపల్లిలోని మై స్పేస్ నిర్మాణ సంస్థ చేపట్టిన బహుళ అపార్ట్‌మెంట్ నిర్మాణంలో వాచ్‌మెన్‌గా చేరాడు. మంగళవారం రాత్రి నిర్మాణానికి కావాల్సిన రెడ్‌మిక్స్ బోరింగ్ వాహనం డ్రైవర్ అక్కడ పడుకున్న హరిరాంసింగ్‌ను గుర్తించకుండా నిర్లక్ష్యంగా వెనకాలకు తీసుకురావడంతో వెనకాల టైర్ల కింద నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ వైద్యశాలకు తరలించారు. మృతుడి బంధు వులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఫోన్ ఎత్తలేదని మహిళపై కత్తితో దాడి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్‌లో అక్రమసంబంధం దారుణానికి దారి తీసింది. తన ఫోన్ కాల్ ఎత్తడం లేదని ఒక మహిళను కత్తితో పొడిచిన వ్యక్తి, తప్పించుకునేందుకు ఆత్మహత్యా యత్నం చేసుకున్న ఘటన కుత్బుల్లాపూర్ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. దుండిగల్ పోలీసుల సమాచారం ప్రకారం, బాలానగర్‌లోని చింతల్‌లో ఉండే నిషాబాటి(38) అనే మహిళకు, గండి మైసమ్మ ప్రాంతంలో ఉండే జీవన్ ఖాన్ (35) అనే వ్యక్తితో గత కొంత కాలంగా అక్రమ సంబంధం నడుస్తోంది. అయితే ఎప్పటిలాగే నిషాకి ఫోన్ చేసిన జీవన్ ఆమెని తన రూమ్‌కు రమ్మన్నాడు. అతడి వద్దకు వస్తున్న సమయంలో ఆమెకు వరుసగా ఫోన్లు చేస్తూనే ఉన్నాడు. ఐతే ఆమె ఫోన్ చాలా సేపు కాల్ వెయిటింగ్ రావడం, జీవన్ ఫోన్‌ను ఆమె ఎత్తకపోవడంతో అనుమానించిన జీవన్, ఆలస్యంగా వచ్చిన ఆమెతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్యా మాటా మాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన జీవన్ ఆమెపై కత్తితో దాడి చేశాడు. విచక్షణారహితంగా కత్తితో పొడవడంతో ఆ ప్రాంతం రక్తంతో అలుముకుంది. అనంతరం ఆ విపత్కర పరిస్థితి నుంచి తప్పించుకోవడానికి నిందితుడు ఆత్మహత్యా ప్రయత్నం చేసి గాయపడ్డాడు. సదరు మహిళ పరిస్థితి విషమించడంతో ఆమెను, గాయపడ్డ నిందితుడిని స్థానికంగా ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై స్థానికులను వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



## చింతపట్లలో వేసవి శిబిరాల ముగింపు వేడుకలు



వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఇన్స్‌పెక్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

**యాచారం జూన్5,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో మన ఊరు మనబడి స్థాపకులు మహ్మద్ సాబేర్ ఆధ్వర్యంలో గత నెల రోజుల నుండి గ్రామంలోని నిర్వహించిన ఉచిత వేసవి ఇంగ్లీషు,వాలీబాల్ శిక్షణ శిబిరాలు బుధవారంతో ముగిశాయి.ఈ సందర్భంగా మహ్మద్ సాబేర్ మాట్లాడుతూ...దాదాపు ప్రతి రోజు ఒక 60 పైన విద్యార్థులు పాల్గొన్నారని గత నెల రోజుల నుండి ప్రతి రోజు ఉదయం ఇంగ్లీషు,వాలీబాల్ తరగతులు వాలీ బాల్ క్యాంప్ నిర్వహించారని అనుభవం గల ఉపాధ్యాయులు పిరాటి అంజయ్య,శ్రీహరి ,శ్రీకాంత్ ,జహంగీర్,విద్యార్థులకు తరగతులు బోధించారని ,మహ్మద్ సాబేర్ విద్యార్థులకు వాలీ బాల్ శిక్షణ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యాచారం సబ్ఇన్స్‌పెక్టర్ వెంకట నారాయణ పాల్గొని విద్యార్థులు జీవితంలో ఎలా ఎదిగాలి సమాజంలో ఇంగ్లీషు ప్రాముఖ్యత ,ఆరోగ్యానికి ఆటల ఆవశ్యకత గురించి చాలా చక్కటి సందేశాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి




**యాచారం జూన్ 5,ప్రభాతవార్త :** క్రీడా కాంట్రాక్టర్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి,బ్రహ్మయ్య,సిఐటియు మండల కన్వీనర్ చందు నాయక్ పేర్కొన్నారు.బుధవారం యాచారం మండలంలోని క్రీడా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కార్మికులు చేస్తున్న ధర్నా కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ...గత 30 సంవత్సరాల నుండి సర్వీస్ చేస్తున్న వారు కూడా ఉన్నారని కాని వారిని పర్మినెంట్ చేయలేదని తక్షణమే రెండు సంవత్సరాలపైబడిన కాంట్రాక్ట్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలను అందించాలని డిమాండ్ చేశారు.ఆందోళన చేసే రైట్ కార్మికులకు ఉందని నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని ఫామ్‌లోకి వస్తే మీ ఉద్యోగం తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు.గత ఆరు రోజుల నుండి నిరసన కార్యక్రమం చేపడుతున్న క్రీడా యాజమాన్యం స్పందించపోవడం శోచనీయమన్నారు.తక్షణమే క్రీడా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి,బ్రహ్మయ్య ,మండల కన్వీనర్ చందు నాయక్,యూనియన్ అధ్యక్షుడు రాములు,నాయకులు బాలకృష్ణ,శివుడు,యాదయ్య,పెద్దయ్య,శ్రీకాంత్,కృష్ణ,గణేష్,సుజాత,తిరుమల,రాణి,లక్ష్మమ్మ,యాదమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం...పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**చౌడపూర్ జూన్5,ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా చౌడపూర్ మండల పరిధిలోని మందిపాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి,పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పలువురు తెలిపారు.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ,ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ముఖ్యపాత్రదారులు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఎస్ఎంసి చైర్‌పర్సన్ యాదమ్మ,నర్సింలు,పంచాయతీ కార్యదర్శి స్వరూప,యువ నాయకుడు మఠం రాజశేఖర్,కారొబార్ ఆనంద్,పలువురు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు



జిల్లా న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

**తాండూరు, జూన్ 5, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎస్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాండూరుకు కేటాయించిన అదనపు మున్సిప్ కోర్టు ప్రారంభంతో పాటు కావల్సిన సిబ్బంది విషయంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో తాండూరు న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పినమోని శ్రీనివాస్, పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, పటేల్ రాంరెడ్డి, యెద్రామి విశ్వనాథ్ ఉన్నారు.

## రఘువీర్‌రెడ్డికి జక్కు అభినందన



అత్యధిక మెజార్టీ సాధించిన కుందూరు రఘువీర్‌రెడ్డిని కలుసుకున్న వైస్ఎంపీపీ జక్కు అనంతరెడ్డి

**ఆమనగల్లు, జూన్05, ప్రభాతవార్త:** నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ సాధించిన కుందూరు రఘువీర్‌రెడ్డిని బుధవారం ఆమనగల్లు మండల వైస్ఎంపీపీ జక్కు అనంతరెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రికార్డు స్థాయి మెజార్టీ సాధించిన రఘువీర్‌రెడ్డిని శాలువా, పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. ఈయనతోపాటు నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిని సన్మానించి అభినందించారు. రికార్డు మెజార్టీ సాధించడం నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీతో పాటు కుందూరు కుటుంబంపై ప్రజలకు ఉన్న అభిమానమే కారణమని జక్కు అన్నారు.

# ఎంఐఎం విజయంతో దారుసలంలోని సంబురాలు

**చార్మినార్,జూన్ 5 ప్రభాతవార్త :** ఎఐఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ ఐదవ సారి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపిగా విజయం సాధించిన సందర్భంగా దారుసలాంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎంఐఎం నాయకులు సంబురాలు జరుపుకున్నారు.ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తన సోదరుడుచాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌తో పాటు ఎంఐఎం శాసన సభ్యులు,ఎమ్మెల్సీలకు మిఠాయిలు తినిపించారు.ఈ సందర్భంగా ఎంపి అసదుద్దీన్ ఓవైసీ పార్టీ విజయం కోసం కృషి చేసిన నాయకులు.కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన నాయకులు,ప్రజలుదారుసలాంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయానికి చేరుకుని ఎంపి అసదుద్దీన్ ఓవైసీని అభినందించారు.ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ,చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ,బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్,మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల,కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్,యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్,నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో పాటు ఎమ్మెల్సీలు,కార్పొరేటర్లు పాల్గొన్నారు.మూడు లోక్‌సభ స్థానాలకు పోటీ చేసిన ఎంఐఎం సార్వత్రిక ఎన్నికల్లో ఎఐఎంఐఎం మూడు పార్లమెంట్ నియోజకవర్గాలలో పోటీ చేసింది.హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎఐఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ,మహరాష్ట్రలోని ఔరంగాబాద్ పార్లమెంట్ నియోజకర్గం నుంచి సయ్యద్ ఇంతియాజ్ అలీ,బిహార్‌లోని కిషన్‌గంజ్ నుంచి అక్తరుల్లా ఇమాన్ పోటీ చేశారు.అసదుద్దీన్ ఓవైసీ ఐదవ సారి ఎంపిగా ఘన విజయం సాధించారు.2019లో ఔరంగాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపిగా విజయం సాధించిన సయ్యద్ ఇంతియాజ్ అలీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎస్‌హెచ్‌ఎస్ పార్టీ అభ్యర్థి చేతిలో ఓడి పోయారు.కాగా కిషన్‌గంజ్ నుంచి పోటీ చేసిన ఎంఐఎం అభ్యర్థి అక్తరుల్లా ఇమాన్ మూడవ స్థానంలో నిలిచారు.కాగా ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ఐదు సార్లు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి వరుసగా విజయం సాధించారు.2004 ఎన్నికల్లో 1,00,145 ఓట్ల మెజార్టీతో,2009 ఎన్నికల్లో 1,13,865 ఓట్ల మెజార్టీతో,2014 ఎన్నికల్లో 2,02,454 ఓట్ల మెజార్టీతో,2019లో 2,82,187 ఓట్ల మెజార్టీతో గెలు పొందారు.కాగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో అసదుద్దీన్ ఓవైసీ తన సమీప బిజెపి అభ్యర్థి మాధవిలతపై 3,38,087 ఓట్ల మెజార్టీతో ఘన విజయంసాధించారు.ఎంఐఎంకు కంచుకోటగా ఉన్న హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 1984 నుంచి 2024 వరకు ఎఐఎంఐఎం పార్టీ విజయం సాధిస్తు వస్తున్నది.కాగా హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి వలీ ఉల్లా సమీర్‌కు 62962 ఓట్లు,బిఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌కు 18641 ఓట్లు లభించాయి.హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలకు డిపాజిట్ కూడ దక్క లేదు.



ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తన సోదరుడు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీకి మిఠాయిలు తినిపిస్తున్న దృశ్యం

## మణికొండ మున్సిపల్‌కు "ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్మెంటల్ పర్‌ఫార్‌మెన్స్" అవార్డు

### - ఆనందం వ్యక్తం చేసిన కమిషనర్ ప్రదీప్ కుమార్

**నార్సింగి, జూన్ 5 ప్రభాతవార్త :** ప్రపంచ ఎన్విరాన్మెంటల్ డే సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు మణికొండ మున్సిపాలిటీకి ప్రకటించిన "ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్మెంటల్ పర్‌ఫార్‌మెన్స్" అవార్డును కమీషనర్ ప్రదీప్ కుమార్ ఐఏఎస్ అధికారిణి వాణిప్రసాద్ చేతులపై అందుకున్నారు. గత మూడేళ్లుగా మణికొండ మున్సిపాలిటీ అధికారులు ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను వర్మీ కంపోస్టు ఎరువుగా తయారు చేస్తున్నారు. చెత్తను ఎరువుగా మార్చి మొక్కలకు ఎరువుగా ఉపయోగపడేల చేస్తూ పొల్యూషన్ తగ్గడానికి దోహద పడుతున్నారని, ఇలాంటి వారికి ప్రోత్సహిస్తూ, అభినందిస్తే మరింత మంది ఇలాంటి మంచి పని చేసేందుకు ముందుకు వస్తారన్న ఉద్దేశంతో ఈ అవార్డును మణికొండ మున్సిపల్ కమీషనర్‌కు అందించడం జరిగిందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ అవార్డులు, అభినందనలు మనం మరింత ఉత్సాహంగా పని చేసేందుకు ఉపకరిస్తాయని తెలిపారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది మరింత కష్టపడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయాలని సూచించారు. అనంతరం మణికొండ మున్సిపాలిటీలోని హుడాకాలనీలో ప్లాంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ దివ్యజ్యోతి, ఏఇఇ సాయి మౌనిక పాల్గొన్నారు.




ప్రపంచ ఎన్విరాన్మెంటల్ డే సందర్భంగా ఐఏఎస్ అధికారిణి వాణీప్రసాద్ చేతుల మీదుగా "ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్మెంటల్ పర్‌ఫార్‌మెన్స్" అవార్డును అందుకుంటున్న కమీషనర్ ప్రదీప్ కుమార్.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

### -జిహెచ్ఎంసి డిప్యూటి కమిషనర్ రవి కుమార్
### -పర్యావరణంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

**అత్తాపూర్ జూన్ 5,ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు.బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అత్తాపూర్‌లోని ఎలిమినేట్ సైట్‌లో జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రేరణ పాఠశాల విద్యార్థులకు ,భూముల పునరుద్ధరణ, ఎడారీకరణ,కరువును తట్టుకునే శక్తి అనే అంశంపై చిత్రలేకన పోటీలను నిర్వహించారు.అనంతరం విద్యార్థులతో కలిసి డిప్యూటి కమిషనర్ రవి కుమార్ మొక్కలు నాటారు.ఈ సందర్బంగా డిప్యూటి కమిషనర్ మాట్లాడుతూ....పర్యావరణాన్ని సంరక్షించుకోవడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చూపిన అది జీవరాశి మనుగడకే పెనుముప్పుగా పరిణమించే ప్రమాదం ఉందని అన్నారు.గాలి,నీరు,ఆకాశం,వృక్ష సంపదలతో పాటు సమస్త జీవరాశులను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు.ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంలో ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు.అనంతరం చెత్త లేకుండా జివిపిని అందించినందుకు ఎస్ఎఫ్ఎ వెంకటేష్‌ను సత్కరించారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జిఎం శ్యామ్ సుందర్ నాయక్, జడ్ఎస్ఐ ఇంచార్జీ డా.దీపా జైస్వాల్,డైఎస్‌డబ్ల్యుఎం శ్రీనివాసులు,యుబిడి మేనేజర్ ప్రసన్న కుమార్,పారిశుధ్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## హెల్మెట్లు పంపిణీ..వేగం కంటే దిశ ముఖ్యం..



**బేగంపేట జూన్ 5,ప్రభాతవార్త**

వేగం కంటే ప్రయాణించే దిశ కూడా ముఖ్యమని,వాహనదారులు సరైన మార్గంలో ప్రయాణించినట్లైతే ప్రమాదాలను నివారించవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిస్ట్యూట్ ఏసీపీ జీ.శంకరరాజు అన్నారు.బుధవారం బేగంపేట టీటీఐ లో సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ఏసీపీ చేతుల మీదుగా హెల్మెట్ల ను ఉచితంగా అందజేసారు.బుధవారం బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిస్ట్యూట్‌లో టీటీఐ,చెన్నైస్‌అమిత్ర ఇంటర్నేషనల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ బల్కంపేట ఆధ్వర్యంలో విధ్యార్థులకు మరియూ ట్రాఫిక్ సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు నివారణ అనే అంశంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేసిన వారిపై కేసులు నమోదయ్యాయన్నారు.నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క వాహనదారుడు సుఖ వంతమైన ప్రయాణం సాగించాలని,ప్రతి ఒక్కరూ హెల్మెట్,సీటుబెల్ట్ ధరించి వాహనాలు నడపాలని ఆయన పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆయాన్, శ్రీకృష్ణ,హీరో మోటార్స్ శ్రావణ్‌కుమార్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిసిన బిజెపి నేతలు



**అత్తాపూర్ జూన్ 5,ప్రభాతవార్త :** చేవెళ్ల పార్లమెంట్‌లో బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ భారీ మోజార్టీతో గెలవడంతో బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకలు రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి శ్రీధర్,మల్లారెడ్డి,తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...పేదలకు సంక్షేమ పథకాలు అందలంటే అది బిజెపితోనే సాధ్యమని భావించి నరేంద్రమోడీకి ప్రజలు మూడోసారి పట్టం కట్టారని పేర్కొనారు.అదేవిధంగా చేవెళ్ల బిజెపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలువడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఏయూ ఫార్మసీ డీన్ డాక్టర్ వి.వసుధభక్షి అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిదాయ్యలంలో బుధవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూ ఎన్ఎస్ఎస్ టీమ్, నిమ్స్ సంయుక్తంగా వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏయూ ఆవరణలో పలు రకాల మొక్కలను నాటి నీరు పోశారు. ఈకార్యక్రమంలోఎన్ఎస్ఎస్ యూనిట్-1 అధికారి డాక్టర్ జె.రాజేం ద్రప్రసాద్, యూనిట్-4 అధికారి జి.కిరణ్‌కుమార్, వాలీంటర్లు పాల్గొన్నారు.

## మన భూమి..మన భవిష్యత్ నినాదం




పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న డైరక్టర్ క్రిష్టారెడ్డి, విభాగాధిపతులు, విద్యార్థులు

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ సమీపంలోని నల్ల నర్సింహ్మారెడ్డి కళాశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కళాశాల డైరక్టర్ డాక్టర్ సీవీ క్రిష్టారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. మొక్కలు నాటి పచ్చధనం పెంపొందించే సామాజిక భాధ్యత కల్గి ఉండాలని ఆయన సూచించారు. 'మన భూమి-మన భవిష్యత్' అనే నినాదంతో 500 మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ టి.రవీంద్రరెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ కె.రామేశ్వరయ్య, టిపిఓ కె.శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ విభాగం ఇంచార్జ్ డాక్టర్ బి.రాజేందర్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏయూలో వక్తృత్వం, పోస్టర్ తయారీ పోటీలు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నిమ్స్ డీన్ లక్ష్మీప్రసన్న

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్గిఉండాలని నిమ్స్ డీన్ డాక్టర్ బి.లక్ష్మీప్రసన్న అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ టీమ్, నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'మనభూమి-మన భవిష్యత్' అంశంపై వక్తృత్వం, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతభను కనబరచగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీన్ లక్ష్మీప్రసన్న చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పర్యావరణ పునరుద్ధరణ పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించి, సృజనాత్మకతను ప్రోత్సహించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్య విభాగం కమ్యూనిటీ మెడిసిన్ హెడ్ డాక్టర్ సంధ్య, సహాయ ప్రొఫెసర్ డాక్టర్ లింగస్వామి, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్, యూనిట్-4 అధికారి జి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
### -మర్రి నిరంజన్ రెడ్డి



మొక్కను నాటుతున్న మర్రి నిరంజన్ రెడ్డి

**ఆదిభట్ల జూన్ 5,ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిభట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ టిపిసిసి సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి తన ఫామ్ హౌస్‌లో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ చిన్న పెద్ద తేగా లేకుండా సొంతంగా ఒక మొక్కను నాటాల్సిందిగా పేర్కొన్నారు.రోజురోజుకు పెరుగుతున్న వాహనాల నుండి వచ్చే పోగ వల్ల గాలిలో కాలుష్యం ఏర్పడుతుందని కాలుష్యం వల్ల ఓజోన్ పొర దెబ్బతిని చాలా అనర్థాలకు దారి తీస్తుంది. కావున ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి భవిష్యత్తుకు స్వచ్ఛమైన గాలిని అందిస్తే మార్గదర్శకులు అవుతారని అందుకే పెద్దలు వృక్షో రక్షిత అన్నారని పేర్కొన్నారు.

## భవిష్యత్ బిజెపిదే....



కొండ విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

**షాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** రాబోయే రాజకీయ భవిష్యత్ బీజేపీ పార్టీదేనని బీజేపీ జిల్లా కార్యదర్శి జి.వెంకట్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావులను బీజేపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డితో నగరంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... బీజేపీ ఘనవిజయం సాధించిందంటే కార్యకర్తలు, నాయకుల సమిష్టి కృషితోనే అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు బీజేపీ వెంట ఉన్నారని, అందుకే బీజేపీ విజయం సాధ్యమైందన్నారు. తెలంగాణలో బీజేపీనే ప్రత్యామ్నాయమన్నారు. పదేళ్ల పాటు పాలన చేసిన బీఆర్ఎస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందన్నారు. బీఆర్ఎస్ కంచుకోటగా చెప్పుకుని మెదక్ స్థానంలో కూడా కాషాయ జెండా ఎగరవేశామన్నారు. ఇక భవిష్యత్ బీజేపీదేనని తెలిపారు.

## పేదలకు అన్నదానం చేసిన చెస్ నిర్వాహకుడు



నిరుపేదలకు అన్నదానం చేస్తున్న జగన్. తదితరులు.

**షాద్‌నగర్, జూన్ 5, (ప్రభాతవార్త) :** అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అలాంటి అన్నదానం చేయడం చాలా సంతోషంగా షాద్‌నగర్ చెస్ అకాడమీ నిర్వహకుడు వానరాసి జగన్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర సహకార సమితి వద్ద ఉన్న రిటైర్డ్ ఉపాధ్యాయుల సేవా సమితి సహాకారంతో నిరుపేద ప్రజలకు తన వంతుగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... చిన్న వయస్సులోనే ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచనతో నిరుపేదలకు అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని పలువురు ఆకాక్షించారు. అనంతరం చిన్నారులు, పెద్దలతో కలిసి తన జన్మదినోత్సవ వేడులను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి నిర్వహకులు క్రాంతికుమార్, బాల్‌రాజ్‌గౌడ్, రమేష్, పాతూరి బ్రహ్మయ్య, సోహెల్, శ్రీకాంత్, బాలు, అహ్మద్, కార్తీక్ సాగర్, మురళీ, గిరిబాబు, శేఖర్‌గౌడ్, మల్లేష్, అవుల రమేష్, రాజునాయక్, దిన్నారం శంకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



పూలమొక్కలను బహుమతిగా అందజేస్తున్న చిన్నారులు.

**షాద్‌నగర్, జూన్ 5, (ప్రభాతవార్త) :** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని చిన్నారుల నుంచి పేదల వరకు ప్రతి ఒక్కరు చెట్లను పెంచి భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని విద్యావేత్త అవార్డు గ్రహిత ఎన్‌కె రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఠాగూర్ స్కూల్ చిన్నారులు ఆయనకు మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ రక్షణ కోసం ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా మెలగాలని ఆయన సూచించారు. రియల్ వ్యాపారం విస్తరిస్తూ పచ్చని చెట్లు కనుమరుగు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తు తరల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడాలని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు. విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి విజయంపై ఘట్‌కేసర్ నాయకుల హర్షం

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ విజయం సాధించడం పట్ల ఘట్‌కేసర్ టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ పట్టణంలో బుధవారం మండల టిడిపి అధ్యక్షులు వేముల సంజీవగౌడ్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ జైతెలుగు దేశం, జైచంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి అహంకార, అసమర్థ పరిపాలనకు వ్యతిరేకంగా ఏపీ ఓటర్లు చంద్రబాబుకు పట్టం గట్టారని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రెండు తెలుగు రాష్ట్రాలలో విశేషమైన అభివృద్ధి జరిగిందని, సాఫ్ట్‌వేర్ రంగం పుంజుకొని వేలాది మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. చంద్రబాబు నాయుడు ప్రజాధరణతో తిరిగి సీఎం కావడం పట్ల తెలుగు రాష్ట్రాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని ఆయన నాయకత్వంలో అమరావతి నగరం పునర్నిర్మాణం జరిగి ప్రజలకు అన్ని రకాల మెరుగైన పరిపాలన అందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసమావేశంలో నాయకులు సామల జగన్మోహన్‌రెడ్డి, కొత్త బిక్షపతిగుప్త, టి.తిరుపాల్, పాటి సురేందర్‌రెడ్డి, టి.మహేశ్‌బాబు, శిష్టా సూర్యనారాయణరావు, ఉడుతల మధుబాబు, జి.చంద్రయ్య, మద్ది రాముగౌడ్, బత్తుల మహేశ్‌గౌడ్, ఎరుకల అశోక్‌గౌడ్, పాటి జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.